ॐ వేదాంతభేరి ॐ

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 50 డిశంబర్ 2017 సంచిక : 12

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1500/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు :

శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.

Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ॐ వేదాంతభేరి ॐ

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 50 డిశంబర్ 2017 సంచిక : 12

విషయ సూచిక

01. ప్రార్థన - 05

02. న శ్రేయో నియమం వినా-శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు- 06

03. పురోభివృద్ధిని గోరువారు పూర్వ వృత్తాంతమును మరువగూడదు
- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు - 12

04. అనుగ్రహం కావాలంటే అర్పిత భావం ఉండాలి- శ్రీసత్యసాయిబాబా -17

05. భాగవత కథలు- భక్త ధ్రువుడు - శ్రీరామచంద్రడోంగ్రే మహరాజ్-21

06. శ్రీ మలయాళస్వామి జీవిత విశేషాలు - 3
- డా ॥ సముద్రాల లక్ష్మణయ్య - 25

07. జ్ఞానసుధ - శ్రీ సర్వభూషణ శివయోగి - 28

08. కథాత్మక గీతా సూక్తులు - ఆచార్య కె.సర్వోత్తమరావు - 30

09. శివమహిమ్న స్తోత్రం - శ్రీమధుసూదనీవ్యాఖ్య - 33

10. శ్రీ మదాంధ్ర మహాభాగవతము - ఆచార్య జక్కంపూడి మునిరత్నం -36

11. ఆతిథ్యంతో శివుని మెప్పించిన మార నాయనారు - మధుర చంద్రశేఖరరావు-39

12. వార్తలు - 42

ముఖచిత్రం :

అవధూత చక్రవర్తి శ్రీ దత్తాత్రేయులు

3-12-2017 దత్తజయన్తి, తిరువణ్ణామలై కార్తీకదీపోత్సవము

29-12-2017 తేది ముక్కోటి ఏకాదశి

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

శ్రీ దత్త స్తవము

01. దత్తాత్రేయం మహాత్మానం వరదం భక్త వత్సలం ।
ప్రపన్నార్తిహరం వందే స్మర్తృగామీ స నోఽవతు ॥

02. దీనబంధుం కృపాసింధుం సర్వకారణ కారణం ।
సర్వరక్షాకరం వందే స్మర్తృగామీ స నోఽవతు ॥

03. శరణాగత దీనార్త పరిత్రాణ పరాయణం ।
నారాయణం విభుం వందే స్మర్తృగామీ స నోఽవతు ॥

04. సర్వానర్థహరం దేవం సర్వమంగళ మంగళం ।
సర్వక్లేశ హరం వందే స్మర్తృగామీ స నోఽవతు ॥

05. బ్రహ్మణ్యం ధర్మతత్వజ్ఞం భక్త కీర్తివివర్ధనం ।
భక్తాభీష్టప్రదం వందే స్మర్తృగామీ స నోఽవతు ॥

06. సర్వరోగ ప్రశమనం సర్వపీడా నివారణం ।
విపదుద్ధరణం వందే స్మర్తృగామీ స నోఽవతు ॥

07. జన్మసంసారబంధఘ్నం స్వరూపానంద దాయకం ।
నిశ్శ్రేయసపదం వందే స్మర్తృగామీ స నోఽవతు ॥

08. జయలాభ యశః కామ దాతుర్దత్తస్య యస్తవం ।
భోగ మోక్ష ప్రదస్యేమం ప్రపఠేత్ స కృతీ భవేత్ ॥

కృతజ్ఞతలు

వేదాన్తభేరికి తమ విలువైన వ్యాసాలను అందించి పత్రిక సౌందర్యానికి తోడ్పడిన రచయితలకు హృత్పూర్వక కృతజ్ఞతలు. ఇక మీదట గూడ మీ సహకారాన్ని అందించగోరుచున్నాము. పత్రిక పుష్టికి తోడ్పడిన చందాదారులకు, పోషకులకు, ప్రకటనదాతలకున్ను కృతజ్ఞతాభినందనలు.

ఇట్లు

వేదాన్తభేరి ప్రచురణ కర్తలు



న శ్రేయో నియమం వినా

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సూర్యుడు నియమము తప్పక సరిగా ఉదయించుచున్నాడు. నియమము ప్రకారము అస్తమించుచున్నాడు. చంద్రుడు, నక్షత్రములు తమ తమ నియమముల ప్రకారము సరిగా గమనము సల్పుచున్నవి. వసంతకాలము రాగానే చెట్లు చిగురించుచున్నవి. గ్రీష్మ ఋతువు నందు తాప మధికరించుచున్నది. ప్రతి సంవత్సరము ఆయా ఋతువులందు నియమ ప్రకారము ఆయా కార్యములు జరుగుచున్నవి. ప్రకృతి యంతము నియమబద్ధముగ వర్తించుచున్నది. విశ్వమును చక్కగా పరీక్షించి చూచినచో ఈ నియమపాలనమను ధర్మము కొట్టవచ్చినట్లు కనిపించును.

మఱి మానవుడు సద్గతిని పొందవలెనని ఈ నియమ పాలనము అవసరములేదా ? ప్రకృతి బోధించు ఈ అపూర్వ ధర్మమును మానవుడు ఎన్నటికిని విస్మరించరాదు, ఉపేక్షించరాదు. "న శ్రేయో నియమం వినా" నియమము లేనిచో శ్రేయస్సు కలుగదు అని పెద్దల వాక్యము. వ్యక్తిగాని, సంఘమునకు గాని, జాతికిగాని నియమము లేనిదే అభివృద్ధియే లేదు.

పశువు పుట్టినపుడు ఎటులుండునో చనిపోవునపుడును అటులనే యుండును. సింహము పుట్టినపుడు క్రూరముగా నుండును. చచ్చునపుడు అట్లే యుండును. మార్పు ఉండదు. స్వభావమునందుగాని సంస్కారము నందుగాని వాటికి అభివృద్ధియే కానుపించదు. మానవుడు అట్లుండినచో ఇక మానవత్వముయొక్క ఆధిక్యత ఏమి ? ఎనుబదినాలుగు లక్షల రకముల జీవరాసులలో మానవునియొక్క ప్రత్యేకత ఏమి ? స్వభావము మారవలెను. సంస్కారము నందు అభివృద్ధి గోచరించవలెను.

మానవుడు మాధవుడుగా మారవలెను. అట్లు మారుచున్నాడా? లేదు. పైపెచ్చు దిగజారి దానవుడుగా పరిణమించుచున్నాడు. మానవుడు తనకు భగవానుడు సృష్టిలో అత్యంత సమున్నత స్థానమును ప్రసాదించెనని భావించి జీవితమును నియమబద్ధముగా గావించుకొని ఇంకను సమున్నతిని బడయుటకై తీవ్రతర ప్రయత్న మాచరించవలెను. బహుజన్మార్జిత ప్రాపంచిక వాసనల ననుసరించి మనస్సు వక్రమార్గమున జనుచుండును. అసురమార్గమున పయనించుచుండును. పరమార్థ నియమము, సదనుష్ఠానము అను త్రాటిచే దానిని బంధించి పరమాత్మయందు స్థాపితమగునట్లు చూడవలెను. కొన్ని కొన్ని చక్కని నియమము లేర్పరచుకొని వాటిని జీవితమందు ఆచరణయందుంచుకొనవలెను.

ప్రతిదినము ఉషః కాలమున బ్రహ్మముహూర్తమందు నిద్రలేచుట, స్నానసంధ్యాజపతప ప్రార్థనాదులను గావించుట, సద్గ్రంథ పఠన మొనర్చుట, శక్తి కొలది బీదలకు సహాయము చేయుట, నిత్య జీవితమునందు ఏవిధమైన పాపకార్యమాచరింపకుండుట, మరల రాత్రి పరుండబోవునపుడు భగవద్ధ్యాన మాచరించుట మొదలుగు నియమములను మానవుడు ఆచరణ యందుంచు కొనవలెను.

ఈ నియమము లన్నిటిలోను దైవచింతన, ప్రార్థన అతిముఖ్యము. తనను సృష్టించి, తనకు ఆయురారోగ్యములను ప్రసాదించి, మోక్షమునకు పరమయోగ్యమైనట్టి మానవ జన్మను అనుగ్రహించి ఎన్నియో అనుకూలములను గావించుచున్న పరమేశ్వరునకు మానవుడు మహాకృతజ్ఞుడై నిద్రలేవగనే ప్రప్రథమమున అమ్మహనీయుని సంస్మరించవలెను. మరల అవకాశమును కలుగజేసికొనుచు నిత్యజీవితమందు ప్రార్థనాదులను గావించు చుండవలెను. ప్రార్థన చేయనిదే, దైవచింతన ఒనర్చనిదే భోజనముగాని, ఉపహారముగాని తాకగూడదను నియమమును ఏర్పరచుకొనవలెను. ఎన్ని

పనులున్నప్పటికిని భోజనమును ఎవరును వదలరుగదా! అట్లే ప్రార్థనను, దైవధ్యానమును గూడ వదలరాదు. అన్ని నియమము లందును ఈ నియమము చాలా ముఖ్యమైనది.

ఇక రెండవది ధర్మపరిపాలన. ఒక చెంప ప్రార్థనాదులను చేయుచు వేఱొకప్రక్క ధర్మమనకు విరుద్ధమైన ఆచరణ చేయుచుండినచో, పరులను బాధించుచుండినచో, అన్యాయము, అవినీతి అమలు జరుపుచుండినచో, చీకటిమార్గమున పయనించుచుండినచో అది సరిగాదు. భగవంతుడు ధర్మస్వరూపుడు. 'ధర్మ సంస్థాపనార్థాయ' అనునట్లు ధర్మోద్ధరణ కొఱకే యాతడు అవతరించుచుండును. కాబట్టి భగవంతునకు అతి ప్రియమైన ధర్మమును దూరీకరించి, ధిక్కరించి, దేవుని చింతన జేయుచుండినచో, ఆ దైవచింతనకు అర్థమే లేదు. దానికి విలువే యుండదు. కాబట్టి దైవచింతనతో బాటు ధర్మాచరణ కూడ జీవుడు తప్పక కలిగియుండ వలెను.

ఈ ప్రకారముగ మానవుడు జీవితమును నియమబద్ధముగ గావించుకొని, సృష్టిలో తనకొసంగబడిన మహోన్నత స్థానమును సార్థకపఱచుకొని తనను తాను సంస్కరించుకొని భగవత్కరుణకు పాత్రుడై తరించవలెను. అలసత్వమును, సోమరితనమును పూర్తిగ విడనాడి ఆత్మోన్నతికై అహర్నిశములు పాటుపడవలెను.

సోమరితనము ఏ రంగమందును పనికిరాదు. ఆధ్యాత్మిక రంగమందు అసలు పనికిరాదు. బద్ధకము, అలసత్వము, తమస్సు మున్నగు వానికి పారమార్థిక క్షేత్రమందు తావేలేదు.. ఒక విద్యార్థి పరీక్షయందు ఉత్తీర్ణుడగుటకు రాత్రింబగళ్ళు ఎంతయో శ్రమించు చున్నాడు. సామాన్యమగు లౌకిక విద్యయందే అంత పట్టుదల, అధ్యవ సాయము, కార్యదక్షత అవసరమైనపుడు ఒక పారలౌకిక విద్యయం

దెంతటి తీవ్ర ప్రయత్నమవసరమో యోచించుకొనవచ్చును.

ఇక ఆయుస్సు చూచెదమా మహాక్షణికమైనది. ఎత్తైన చెట్టుయొక్క కొమ్మచివరగల ఆకుపై వ్రేలాడు మంచుబొట్టువలె అది క్షణభంగురమైయున్నది. కనుకనే విష్ణు భగవానుడు గరుత్మంతునకు ఉపదేశించునపుడు రేపు చేయవలసిన (పుణ్య) కార్యమును ఈరోజే చేయవలెననియు, సాయంత్రము చేయవలసిన కార్యమును ప్రొద్దుననే చేసి వేయవలెననియు, మృత్యువు ఎవరికొరకును వేచియుండదనియు హితము చెప్పెను. కావున మోక్ష ప్రయత్నమందు మీనమేషములు లెక్కపెట్టుధోరణి ఏమాత్రము భావ్యము కాదు. అద్దానికి స్వస్తి చెప్పి తత్క్షణమే సాధనరంగమునందు దుమికవలెను.

ఏ కార్యమైనను తత్క్షణమే చేయక జాగుచేయువాడు దీర్ఘసూత్రి యనబడును. ఇప్పుడే ఏమి తొందఱ ? నిదానముగా చూచుకొనవచ్చును. అని తలంచి కార్యమును వాయిదా వేయువాడు దీర్ఘసూత్రి. అతను పనిని తెమల్చడు. తరువాత తరువాత అనుచుండును. తమోగుణ ప్రభావముచే బద్ధకము ఆవహింప కార్యమును నెరవేర్చక రోజులు గడుపుచుండును. దీర్ఘసూత్రి అనుపదమునకు అర్థము తెలియక ఒకరు మఱియొకరిని దానిని గూర్చి ప్రశ్నింపగా అతడు చెప్పిన సమాధాన మీ విధముగనున్నది. One that has a long rope to tie himself తన్నుతాను బంధించుకొనుటకై ఒక పెద్దత్రాడు తెచ్చుకొనువాడే దీర్ఘసూత్రి. దీర్ఘమనగా పొడుగు. సూత్రమనగా త్రాడు. పొడవైనత్రాడు కలవాడు దీర్ఘసూత్రి. ఈ నిర్వచనము చాల చక్కగయున్నది. వెనుకటికి ఒక శిష్యుడు గురువు గారిని ఈవిధముగ ప్రశ్నించెనట. స్వామీ ! ఏ శాస్త్రము చూచినా ఏ పురాణముచూచినా, ఒక విషయము స్పష్టమగు చున్నది. ఏమనగా, జీవుని అంత్యకాలమున యమధర్మరాజు ఒకత్రాడు తీసుకొని

వచ్చి అతని మెడకు చుట్టి ఈడ్చుకొని పోవునట ! అయితే గురువుగారూ! రోజుకు ప్రపంచము మొత్తము మీద కొన్ని వేలమంది చనిపోవుచుందురు గదా !మఱి అన్ని వేల త్రాళ్ళు యముడుగారు ఎక్కడ నుండి తెచ్చెదరు ? వారిలోకములో త్రాళ్లు తయారుచేయు ఫ్యాక్టరీ ఏమైనయున్నదా ?

శిష్యుని మాటలువిని గురువు నవ్వి 'నాయనా' ఆ త్రాళ్ళను గూర్చిన బెడద యమున కేమియును లేదు. బ్రతికియుండగనే ఎవరికి వారు తమ మెడచుట్టు త్రాళ్ళు చుట్టుకొనుచున్నారు. అహంకారము ఒకత్రాడు, మమకారము ఒక త్రాడు, ఈర్ష్య ఒకత్రాడు, కోపము ఒకత్రాడు. ఈ ప్రకారముగ వారువారు తయారుచేసికొని తమ తమ మెడలకు ముందుగనే చుట్టుకొనియున్న ఆ త్రాళ్ళను యముడు పట్టుకొని లాగుకొని పోవును. అంతియే అని సమాధానమొసంగెనట ! కాబట్టి జీవిత కాలములో వారు వారు తయారుచేసికొనిన ఈ కామక్రోధాదులను త్రాళ్ళన్నిటినీ వివేకముచే, విజ్ఞానముచే, వైరాగ్యముచే, భగవద్భక్తిచే ఛేదించి వేయవలెనేకాని దృఢపరచుకొనరాదు. 'దీర్ఘసూత్రి' అనగా సోమరి. అతడు ఈ త్రాళ్ళను అనవసరముగ పెంచుకొనుచుండును. కనుకనే అతడు జీవితములో సత్ఫలితములను పొందజాలక అధోగతి చెందుచుండును.

కాబట్టి పనులను ఎప్పటికప్పుడు తెమల్చివేయుచుండవలెను. ఆలస్యము చేయరాదు. ఆధ్యాత్మిక సాధన విషయములో అశ్రద్ధ పనికిరాదు. మానవజన్మ మరల మరల వచ్చునని గ్యారంటీ లేదు. ఇప్పుడున్న సదవకాశములు తిరిగి ఏర్పడునను హామీలేదు. కావున అమూల్యమగు ఈ మానవజీవితమందు ఆచరించదగిన మోక్షప్రయత్నములను జాగుచేయక ఇప్పుడే ఆచరించవలెను. శమదమాదులు, యమనియమాదులు,భక్తి జ్ఞానవైరాగ్యములు మున్నగు వానిని యిప్పుడే ఒక్కొక్కటిగా చక్కగ అభ్యసించుచు రావలెను. దీర్ఘసూత్రివలె 'తరువాత'కువాయిదా వేయగూడదు.

రావణాసురుడు తన అంత్యకాలమున సమీపమున నున్న వారితో ఈ ప్రకారముగ చెప్పెనట. "నేను నా జీవితకాలములో ముఖ్యమైన మూడు పనులు సాధించతలంచితిని. మొదటిది స్వర్గమునకు నిచ్చెన వేయుట, రెండవది నా దేశము చుట్టునున్న లవణ సముద్రజలమునంతను మధురజలముగ మార్చివేయుట. మూడవది నరకలోకములో పాపులు బాధలనుభవించు చీకటి సొరంగము లన్నిటిని పూడ్చివేయుట. 'తరువాత చేయుదుములే ' అని కాలయాపన చేయుచు వచ్చినందువలన ఆ పనులను నేను నా జీవితకాలములో నిర్వహించలేకపోయితిని. కాబట్టి ఎప్పుడు చేయవలసిన పనిని అప్పుడే చేసి వేయుట ఉత్తమము. నేను నా జీవితములో నేర్చుకొనిన గొప్ప పాఠమిది " అని.

ఆధ్యాత్మరంగమున ఈ దీర్ఘసూత్రత్వము (సోమరితనము) మహాప్రమాదకరము. కాబట్టియే శ్రీకృష్ణపరమాత్మ దానిని తమోగుణములో చేర్చివైచి, దానినవలంబించువారు తామసకర్తయని పేర్కొనెను. 'విషాదీ దీర్ఘసూత్రీ చ కర్తా తామస ఉచ్యతే' (గీత - 18-28) ఏడుపుకొట్టువాడు, పనులను ఇప్పుడే చేయక తరువాతకు వాయిదా వేయువాడు తామసకర్త యనబడును.

కనుక సాధకుడగువాడు తమోగుణములో చేరిన అట్టి దీర్ఘసూత్రత్వమును ఏకాలమందును అవలంబించక శాంతముగ, గంభీరముగ తన సాధనలను కొనసాగించుకొనుచు పోవుచుండవలెను. అలసత్వమునకు ఏకాలమందును చోటీయరాదు. అపుడు మాత్రమే జీవుడు తన లక్ష్యమును సాధింపగల్గును. తన భవిష్యత్తును చక్కగ రూపొందించగల్గును.

వాసనలు గలవారిలో దేవుడు వాస +న = నివసించడు

పురోభివృద్ధిని గోరువారు పూర్వ వృత్తాంతమును మరువగూడదు

- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

(గత సంచిక తరువాయి)

తిలమధ్యే యథా తైలం క్షీరమధ్యే యథా ఘృతమ్ ।

పుష్పమధ్యే యథాగంధః ఫలమధ్యే యథా రసః ।

కాష్ఠాగ్నివత్ప్రకాశేత ఆకాశే వాయువచ్చరేత్ ॥

నువ్వులందు నూనె వలెను, పాలయందు నేయి వలెను, పువ్వుల యందు పరిమళము వలెను, ఫలముల యందు రసము వలెను, కట్టె యందు అగ్ని వలెను, ఆకాశమందు వాయువు వలెను ఈ ఆత్మ దేహమందు ప్రకాశించుచున్నది. కావున పుష్పము నుండి సుగంధమును, నువ్వుల నుండి నూనెను, పాల నుండి వెన్నను, ఫలము నుండి రసమును, అరణి నుండి అగ్నిని ఏలాగున తగిన ఉపాయములచే వేరుపరచుకొనవలెనో, అలాగున ఈ దేహములో గల దేహిని అనగా ఆత్మజ్ఞానమును పై జెప్పిన తపస్సు, బ్రహ్మచర్యము, సమ్యక్ జ్ఞానము మొదలైనవానిచే ప్రత్యక్షము చేసికొనవలెను.

పరిశ్రమను గుఱించి ఒక సంగతి చెప్పెద. ఒక ఇంటిలో పది మంది యుండిన ఒకరు గాని లేక ఇద్దరు గాని మాత్రము సంపాదించు దానిని అందరును భోజనము చేయుచు, తక్కిన వారెవరును ఏమియును చేయక యుండిన అట్టి సంసార మేలాగున వృద్ధి నందగల్గును ? పదిమందిన్ని పని చేయువారై యుండిన ఏలాగున అట్టి కుటుంబము వృద్ధి నొందగల్గునో ఆలాగున ఈ దేహములో అన్ని యింద్రియములున్ను

పనిచేయునవిగా నుండిన, ఎంతో జ్ఞానధనమును సంపాదించు కొనవచ్చును. విజ్ఞానశాస్త్ర పరిశోధకులు మెదడును పరిశోధించి ఒక కోటి పది లక్షల జవసత్త్వ అణువులు అందు గలవనియు, వాటిలో మంచి పరిశ్రమ చేయగలవారిలో మాత్రమే ఏదో ఒక వందగాని రెండు వందలు గాని మెలకువ గలిగి పనిచేయుచున్నవనియు తక్కినవన్నియు నిద్రపోవుచున్నవనియు తెలుపుచున్నారు. ఇది శ్లోకములు చెప్పుట గాని, శాస్త్రములలో గలదని అట్టహాసము చేయుటగాని కాదు. ప్రత్యక్షముగ సైన్సు అనగా విజ్ఞాన శాస్త్రము ఋజువు చేయుచున్నది. చూడదలంచువారు అట్టి పరిశోధకుల నవలంబించి చూచుకొనవచ్చును. కనుకనే యోగవాసిష్ఠమున సోమరితనమును గూర్చి యీలాగున చెప్పబడినది.

సీమానం సర్వ దుఃఖానామాపదాం కోశముత్తమమ్ ।

బీజం సంసార వృక్షాణాం ప్రజ్ఞామాంద్యం వివర్జయేత్ ॥

సమస్త దుఃఖములకు పొలిమేరయు, ఆపదలన్నింటికీ నిలయమును,సంసార వృక్షము లన్నింటికిని ఆకరమునునగు ఈ ప్రజ్ఞా మాంద్యమును అనగా సోమరితనమును ప్రయత్నము చేత విడిచి పెట్టవలెను.

ఇట్టి నిద్రపోవుచున్న జీవాణువులను మేలుకొలుపుటకు మన పూర్వీకులు యోగశాస్త్రమును కనిపెట్టిరి. కనుకనే యోగముచే దివ్యశక్తి గలుగుననియు, గూఢతత్త్వము బయలుపడుననియు చెప్పెదురహస్యము. దీనిలో ప్రాణాయామము చాలా ముఖ్యమైనది. అయితే మంచి అనుభవజ్ఞుల దగ్గరనుండి అభ్యసించుకొనవలెను. తపస్సున్ను అట్టి అణువులను నిద్రావస్థ నుండి జాగ్రదవస్థలోనికి తెచ్చునదే. నిర్మలమైన అనన్యభక్తియున్ను దీనిలో నిరంతర దైవచింతన అటువంటిదే యగును.

అయితే అన్నిటికిన్ని ఆహార నియమమున్ను, అనుష్ఠాన నియమ

మున్ను తప్పక యుండవలెను. ఇదే దీనిలోగల పరమ రహస్యము. ఎవరైనను ఒక మూడు నెలల కాలము ప్రాణాయామము చేసి చూడుడు. ఎంత నిర్మలత్వము, ఎంత చురుకుదనము, ఎంత ఉత్సాహము గలుగుచుండునో మీరే గ్రహించు కొనవచ్చును. కాని స్థలమున్ను, ఆహార మున్ను సరిగా నుండవలయును. అయితే ఈ యానందములో, ఈ సుగుణ సంపత్తిలో, ఈ యుల్లాసములో మునిగిపోయి ఆత్మను తెలిసికొనకపోయిన జన్మసాఫల్యము కలుగదు. ఈశ్వర కరుణ సంపాదించకపోయిన ఆ సంతోష మంతయు నష్టమగును. ఇదే యోగములో గల కీలకము. కావున దైవజ్ఞానములో దృష్టి నుంచి యోగమభ్యసించవలెను. లేనిచో భర్తృవియోగముగల స్త్రీకివలె నీకున్ను దైవమునుండి, ఆత్మనుండి వియోగము గలిగి దుఃఖించెడి కాల మొకప్పుడు కలుగును. ఇది జ్ఞాపకములో నుంచుకొని యోగములో దిగవలెను.

అట్లుకాని యోగి కాని, యోగిని కాని అయినను చక్రవాక పక్షులలో భార్యా వియోగము గలిగిన మగ పక్షియు, భర్తృ వియోగము గలిగిన ఆడపక్షియు ఏలాగున దుఃఖముతో గూడి కాలము గడుపవలసి యుండునో, దైవ సాక్షాత్కారము గలుగని యోగుల గతియు నటువంటిదే యని జ్ఞాపకములో నుంచుకొనవలయును. అట్టి సాక్షాత్కారము దైవభక్తి చేతను, జ్ఞానము చేతను, తపస్సు చేతను, ధ్యానము చేతను మాత్రము కల్గును. దానికి యోగము చాలా సహాయపడును. యోగము బుద్ధ్యాది ఇంద్రియములను శుద్ధపరచి ఆనందమయకోశము వరకు వెళ్ళును. అవి ప్రకృతియొక్క శుద్ధ భాగములు కాన వానికి శాశ్వతత్త్వము కలుగదు. ఈ రెండవ వానిలో మీ యొక్క గురువు జీవితమున్ను, మీ పూర్వీక ఋషుల జీవితమున్ను జ్ఞాపకము లోనికి తీసుకొని రావలెను. వారి యొక్క పరిశుద్ధ ఇంద్రియ నిగ్రహము, శాంతము, కరుణ, నిరంతర

పరిశ్రమ, తపస్సు, సాధుభావము, పుణ్యబుద్ధి మొదలగు అమూల్యమైన గుణములను మరచిపోక హృదయములో నుంచు కొనవలెను. ఇదిన్ని మీ పురోభివృద్ధికి చాలా ఉపయోగము కలుగచేయును.

కుచేల మహామునికి మహదైశ్వర్యము గల్గినను తన యొక్క పూర్తి వృత్తాంతము మరువక బీదరిక జీవితమున తపశ్చర్యయును నిరంతర శ్రీమన్నారాయణ చరణారవింద అనన్యభక్తియును మఱుపు కలుగనీయక వర్తించినందుచే, ప్రకృతి అమ్మహాత్ముని ఆత్మను ఆవరించక యుండుటచే నాతడు జీవన్ముక్తిపదవి నందెను. నహుషుడను రాజు స్వర్గలోకమున ఇంద్రుని స్థానము గల్గినప్పుడు తన పూర్వపు ధర్మబుద్ధియు, సౌశీల్యమున్ను మరచి ప్రవర్తించినందుకే ఋషుల శాపము వలన స్వర్గలోకము నుండి భూలోకము లోనికి అజగరమై పడిపోయెను. ఈ కథలను జ్ఞాపకము చేసికొనిన ఎవరికి ఎప్పుడున్ను పతనము కలుగదు. ఇప్పుడున్న తక్కువ బుద్ధి గల కొందరు ఉన్నత ఉద్యోగము వచ్చినను, లేక ఉన్నతమైన మఠాధిపతుల పీఠము లభించినను తమ పూర్వ సంగతిని మఱచి ప్రవర్తించుట చేత పతన మొందుచున్నారు.

ఇట్టి దురవస్థలు కొన్నిటిని ప్రత్యక్షముగ చూచుచున్నాము. ఆత్మ విషయములో నీవు శూరుడవై, ధీరుడవై, శుద్ధుడవై యుండిన మాత్రమే నిన్ను మోక్షలక్ష్మియు, వైరాగ్యలక్ష్మియు, జ్ఞానలక్ష్మియు, యోగలక్ష్మియు, ముక్తికాంతయు వరించును. అట్లైన మాత్రము నీవు మోక్ష సామ్రాజ్య పట్టాభిషిక్తుడవై ప్రకాశింప గలవు. ఈ చెప్పినవారికే పంచకన్యకలని పేరు. పట్టాభిషిక్తుడు కావలసియున్న రాజ్యలక్ష్మి వరించవలెను. అట్లు కాని వారికి పట్టాభిషేకము కలుగదు. కావున పై జెప్పిన పంచకన్యకలు గాని లేక వారిలో ఒకతె గాని నిన్ను వరించవలసి యుండిన నీవు ధీరోదార విరాగ గుణములు కలిగి యుండవలెను. ఆ కన్యలు సామాన్యలు కారు సుమీ !

మహాధీరశూర గుణోపేతుడగు చక్రవర్తి కుమార్తెలు పిరికిపందను వరింతురా? మహోదార శూరధీర గుణములుగల రాచకొమరుని మాత్రమే వరింతురను సంగతి నీవు జ్ఞాపకములో నుంచుకొనవలెను. లేనిచో ముక్తికాంత నిన్ను వరింపజాలదు. ఆ దివ్యకన్యక వరించనిచో నీకు మోక్షపట్టాభిషేకము జరుగదు. కాన దానికి తగిన ధీరోదార విరాగములన్నిటిని గలుగ చేసికొనుము. తీవ్ర వైరాగ్యమున్ను, నిరంతర ఈశ్వర నిష్ఠయున్ను గలిగియుండేలాగున చూచుకొనుము. అది స్వయం వరణము. మీ సుగుణములన్నియు, తపస్సులన్నియు, వైరాగ్యములన్నియు, ఆకాశవీధిలో శరచ్చంద్రిక వలె ప్రకాశింపవలెను. మీ యొక్క శాంతము, కరుణ, ప్రసన్నత, వనములో వసంతకాలము వలె శోభించును, సుగంధ పుష్ప వాసన వలె ప్రపంచమంతటను వ్యాపించుచుండవలెను. మీయొక్క నిర్మల జీవితమును గురించి రాజ గృహములలోను, అంతఃపురములలోను, పల్లెలందును, పట్టణములందును, బీదలు వసించు స్థానములందును వసంత కాలములో కోయిల కూయుచున్నట్లు లోకము గానము చేయవలెను.

ఈ విషయమై నీవేమియు చేయనక్కరలేదు. నీ యొక్క దైవభావన మరువక, శమదమాది గుణములను విడనాడక గురుభక్తియు, దైవభక్తియు సదా కలిగియుండిన చాలును. ఇట్టి స్థితి నీవు గోరనక్కరలేదు. అప్పుడు పుష్పములోగల సుగంధవాయువు దశదిశలు వ్యాపించునట్లు అవ్యక్తమగు ఆ ప్రకృతి మోక్షరాజగృహాంతరాళమున నుండు ముక్తికాంతల కర్ణపుటములలో నీ యొక్క శాంత శమదమాది గుణములును జ్ఞానమున్ను వినవచ్చును. అచ్చట నుండి ముక్తి కాంత, జ్ఞానలక్ష్మి మీ స్వయంవరమునకై మీ యొక్క తపోవనములోనికి రావలసి యుండును సుమీ !



అనుగ్రహం కావాలంటే అర్పిత భావం ఉండాలి

- శ్రీ సత్యసాయిబాబా

ప్రేమ స్వరూపులారా !

దైవం లేని స్థానం ఈ ప్రపంచంలో కానరాదు. పర్వతములలో విహరించేది దైవమే. సముద్రములలో సంచరించేది దైవమే. పల్లెలలో జీవించేది దైవమే. పట్టణాలలో నివసించేది దైవమే. సర్వత్ర వ్యాపించినది దైవమే. ఈ శక్తి బండారమును ఎవరు గుర్తింతురో, ఎవరు అర్థం చేసుకొందురో అట్టివారే ధన్యులు.

దైవంయొక్క శక్తి సామర్థ్యములకు పరిమిత మనేదే లేదు. ఈ జగత్తు నందు జీవించే ప్రతి ప్రాణికి కొంత పరిమిత మనేది ఉన్నది. ఈ ప్రాణులన్నింటిలోను మానవ జన్మ చాల ఉత్తమమైనది. సౌజన్యమైనది, సౌశీల్యమైనది. ఇట్టి మానవునికి శారీరకశక్తిని పరిమితం గావించి అపరిమితమైన మానసిక శక్తిని అందించాడు భగవంతుడు.మానసిక శక్తికి ఒక పరిమితమే లేదు. సాధించాలని సంకల్పించుకొంటే దేనినైనా సాధించగలడు మానవుడు. దైవమునే సాధించగలడు. ఇట్టి దివ్యమైన శక్తి ఒక్క మానవునియందు మాత్రమే ఉన్నది. కానీ మానవుడు తన శక్తిని తాను గుర్తించుకోలేక, మానవునిగా భూమిపై జీవించలేక అనేక కలతలకు, కల్లోలములకు గురి అవుతున్నాడు. తాను ఆకాశంలో పక్షివలె సంచరిస్తున్నాడు. జలములో మీనమువలె జీవిస్తున్నాడు,చంద్ర మండలమును కూడా చేరగల్గుతున్నాడు. కానీ భూమిపై మానవునిగా బ్రతుకలేక పోతున్నాడు. మానవునిగా పుట్టి మానవునిగా బ్రతుకలేకపోవడం ఎంత అవమానకరం!

మానవుడు దేనిని సాధించవలెనన్నను భగవదనుగ్రహం అత్యవసరం. భగవంతుణ్ణి శరణుజొచ్చినప్పుడు, భగవంతుని చేతిలో తన జీవితాన్ని ఉంచినప్పుడు, మానవుడు సాధించలేని కార్యముండదు. తనను ప్రేమించి ఆశ్రయించిన కుచేలునికి భగవంతుడు ఎట్టి భాగ్యమును అందించాడో చరిత్ర మనకు నిరూపిస్తూనే ఉన్నది కదా ! భగవంతుణ్ణే తన మిత్రునిగా విశ్వసించిన సుగ్రీవుడు పోగొట్టుకొన్న రాజ్యమును కూడా తిరిగి పొందగల్గాడు. లంకలో పడరాని బాధలు పడి నిరంతరము నామస్మరణ గావిస్తూ తనను శరణుజొచ్చిన విభీషణుణ్ణి రాముడు లంకారాజ్యానికే అధిపతిగా చేశాడు. ఒక్క పరి ఏ కించిత్తైనా అర్పితం చేస్తే అనంతమైన ఫలితాన్ని అనుగ్రహిస్తాడు భగవంతుడు.

విలువలేని చిన్న కట్టెముక్కైనా అగ్నితో స్నేహం చేసిందంటే అగ్ని స్వరూపాన్ని పొందుతుంది. కొన్ని నిమిషాలు చేతిలో ఉంచుకొంటే అవిరైపోయే నీటిబిందువు సముద్రంతో చేరిందంటే సముద్ర స్వరూపాన్ని ధరిస్తుంది. అదేవిధంగా మానవుడు తన జీవితాన్ని సార్థకం చేసుకోవాలంటే, దివ్యత్వాన్ని గుర్తించాలంటే భగవంతునికి సమీపంగా వెళ్ళాలి. భగవంతునిలో కరిగిపోవాలి. ఈనాటి మానవుడు భగవత్తత్వాన్ని గుర్తించుకోలేక అనేక మంత్రములచేతను, తంత్రములచేతను, సాధనలచేతను కాలమును గడుపుతున్నాడు. ఈ కర్మకాండకు భగవంతుడు ఏనాటికీ చిక్కడు, దక్కడు. భగవంతుణ్ణి ప్రేమించి సమీపించాలి. అయితే ఈ సాధనలు చేయకూడదని నేను చెప్పడం లేదు. కానీ ఇవన్నీ కాలమును సార్థకం గావించుకొనే నిమిత్తమై సల్పే సత్కర్మలు మాత్రమే. పూజలు, భజనలు చేయవచ్చును. సాధనలు సల్పవచ్చును, తపస్సు ఆచరించవచ్చును. కానీ దైవసేవయందు మాత్రం మనస్సు లగ్నం

కాకుండిన ఇవన్నీ నిరుపయోగమవుతాయి.

అర్పిత భావం

భగవంతునికి కూడా కొన్ని కోరికలున్నాయి. అయితే ఆ కోరికలను సాధకుల సాధనలను సార్థకం గావించే నిమిత్తమే ఉపయోగపెడుతుంటాడు. కృష్ణుడు తన వద్దకు వచ్చిన కుచేలుణ్ణి నాకోసం ఏమి తెచ్చావని అడిగాడు. వామనుడు బలిచక్రవర్తి వద్దకుపోయి మూడడుగుల నేల దానమడిగాడు. రాముడు శబరి వద్దకు పోయి ఆకలిగా ఉంది, ఏదైనా పెట్టమని ఆశించాడు. ఆమె ఏమైనా ధనము నిచ్చిందా ? గొప్ప ఫలముల నిచ్చిందా ? లేదు. అడవిలో తనకు చిక్కిన రేగిపళ్ళలో రెండింటిని రామునికి అందించింది. ఒక గోపిక వద్దకు వెళ్ళాడు కృష్ణుడు, " ఆకలి, ఆకలి " అన్నాడు. "అయ్యో ! కృష్ణా! ఏమీ లేదే ఇంట్లో ! ఏమివ్వగలను ?" అని ఆమె బాధపడింది. " మీ ఇంట్లో ఉన్న ఆ నీళ్ల మజ్జిగ ఇవ్వు, చాలు " అన్నాడు. దానినే ఒక కప్పులో పోసి ఇచ్చింది. కృష్ణుడు త్రాగాడు, ఆనందించాడు. అడవిలో ఆకులలములు తింటూ పడరాని బాధలు పడుతున్న ద్రౌపది వద్దకు వెళ్ళి, " ఆకలి, ఆకలి" అన్నాడు. " కృష్ణా ! నేనేమైనా హస్తినాపురంలో ఉన్నా ననుకున్నావా ? నీ ఆకలి తీర్చడానికి నా దగ్గర ఏమున్నది !" అని ఆమె విచారం వ్యక్తం చేసింది. "ఏదైనా ఉండనీ, నీవు తినేదేదో నాకు పెట్టు " అన్నాడు. కానీ ఆ రోజు ఆమె దగ్గర ఏదీ లేదు. వంట వండిన పాత్రలో ఏదైనా చిన్నమెతుకు అంటుకొని ఉన్నదేమో చూడమన్నాడు. ఆ పాత్ర అట్టడుగున చిన్న ఆకు కనిపించగా దానిని కృష్ణునికి అర్పించింది. ఆ అల్పమైన ఆకుతోనే అనంత స్వరూపుడైన భగవంతుని ఆకలి తీరింది. "బ్రహ్మాండమంతయు బొజ్జలో నున్నట్టి

తనకు భక్ష్య భోజ్యములు పెట్టదగునా ? ! సర్వ జలముల యందు సంచరించెడి తనకు స్నానంబు చేయింప సాధ్యమగునా ? !" సర్వత్ర వ్యాపించియున్న భగవంతుణ్ణి ఏవిధంగా తృప్తిపర్చడానికి వీలౌతుంది. దేనికోసం ఆశిస్తున్నాడు భగవంతుడు ? నిజంగా మీ జీవితాన్ని సార్థకం గావించాలని ఆశిస్తున్నాడేకాని తనకు ఎట్టి వాంఛలూ లేవు. భగవంతునిది నిరంతరము ఇచ్చే స్వభావమేకాని పుచ్చుకొనే స్వభావం కాదు. అలాంటి భగవంతుని చేతిలో మీ జీవితాన్ని పెడితే అన్నీ తానే చూసుకుంటాడు. చిన్న పిల్లలు గాలి పటాలను ఎగురవేయడం మీరు చూసేయుంటారు. గాలిపటం ఆకాశంలో ఎంత ఎత్తుగా ఎగిరినప్పటికీ దాని త్రాడు మాత్రం పిల్లవాని చేతిలోనే ఉంటుంది. అదేవిధంగా మనం మన జీవితమనే గాలిపటాన్ని ఈప్రపంచంలో ఎక్కడ విహరింపజేస్తున్నప్పటికీ దీనికి ఆధారమైన ప్రాణశక్తిని మాత్రం భగవంతుని చేతిలో పెట్టాలి. అప్పుడు ఎక్కడికి వెళ్ళినప్పటికీ తానే దీనిని రక్షిస్తుంటాడు. ఇలాంటి దైవాన్ని పొందే సులభమైన మార్గం ఒక్కటే ఒక్కటి. దైవానికి సమీపంగా వెళ్ళాలి, అతనికి మీ జీవితాన్ని అర్పితం చేయాలి, అతని ప్రేమలో కరిగిపోవాలి, జీవితాన్ని తరింపజేసుకోవాలి.

చందాదారులకు విజ్ఞప్తి

వేదాన్తభేరికి సంవత్సర చందా పంపిన వారి సంవత్సర చందా ఈ డిశంబరు నెలతో ముగిసినది. కాబట్టి మీ చందా నెంబరు వ్రాస్తూ 2019వ సం॥ చందా నూరు రూ/-లు వెంటను మనియార్డర్ చేయండి. ఈ డిశంబర్ ఆఖరుకు చందా పైకం పంపని వారికి పత్రిక నిలిపి వేయబడును.

– పబ్లిషర్, వేదాన్తభేరి.

భాగవత కథలు – భక్త ధ్రువుడు

మూలం

శ్రీరామచంద్రడోంగరే మహరాజ్ అనువాదం :

(గత సంచిక తరువాయి) శ్రీ స్వామి విద్యాస్వరూపానంద

ఉత్తానపాద మహారాజుకు సునీత, సురుచి అని ఇద్దరు రాణులు, ఉత్తముడు, ధ్రువుడు అని ఇద్దరు కుమార్లు వుండిరి. రాజుకు సురుచి ప్రీతి పాత్రురాలు, సునీత కాదు. మనందరి విషయం కూడ ఇంతే. మనం నీతిని ప్రేమించం. ఇన్ద్రియాలను, వాసనలను ప్రేరేపించే (తప్పుదారి పట్టించే) సురుచినే ప్రేమిస్తాము.

ఒకమారు ఉత్తానపాదుడు సింహాసనంపై కూర్చొని వుండినాడు. సురుచి కూడ అచటే కూర్చొని వుండినది. ఉత్తముడు రాజు యొక్క ఒడిలో ఆడుకొంటుండినాడు. దాన్ని చూచిన ధ్రువుడు నేను కూడ తండ్రిగారి వద్దకు పోతే తనను కూడ ఒడిలోకి ఎత్తుకుంటారని ఆలోచించాడు. అతడు పరుగెత్తుకొంటూవచ్చి తనను కూడ ఒడిలో కూర్చోపెట్టుకోమని అడిగాడు.

బాలుడు బాలకృష్ణుని స్వరూపం. అతనిని ఎప్పుడు అవమానించకు. పెద్ద పెద్ద మహాత్ములుకూడ బాలురతో అడుకుంటారు. రామదాస స్వామీజీ 'పిల్లలతో ఆడడం చేత నాకు ఆనందం కలుగుతూ వుంది' అన్నారు. పిల్లలు తమ మనస్సులో వున్న దాన్నే చెప్పుతారు. ఏం చెప్పుతారో దాన్నే చేస్తారు. మనస్సు, వాక్కు క్రియ ఒకటే అయినప్పుడే నీవు భగవంతునిపై భక్తిని సరైన పద్ధతిలో చేయగలవు. అట్టి భక్తే నీకు ఆనందాన్నివ్వగలదు. బాలకులు దోషరహితులు, వారికి కపటాన్ని నేర్పవద్దు, వారిపై చిన్న వయస్సులోనే మంచి సంస్కారాలను కలుగచై, వారిపై అనుచిత మురిపాన్ని చూపవాకు.

ఉత్తానపాదుడు ఆనందంతో ధ్రువుని తనఒడిలో కూర్చోబెట్టుకోవాలనుకున్నాడు. కానీ సురుచికి ఇది గిట్టలేదు. జీవుని వద్దకు ఎప్పుడు కానీ భజనానందం వచ్చిందంటే అప్పుడా విషయంలో సురుచి విఘ్నాన్ని ఉత్పన్నం చేస్తుంది. పూజ చేసేటప్పుడు మనస్సు వంటింటివైపు పోయిందంటే, భగవంతుని భజించేటప్పుడు మనస్సు విషయ వాసలవైపు కొట్టుకపోయిందంటే సురుచి అచటికి వచ్చిందని తెలుసుకో.

రాజు ధ్రువుణ్ణి ఒడిలో కూర్చోబెట్టడం సురుచికి ఇష్టం లేదు. ఆమె ఆలోచించింది. "రాజుకు (జీవాత్మకు) ధ్రువుడు (భజనానందం) లభిస్తే అతడు (రాజు) వాసనల కధీనుడు కాడు. అప్పుడు నాపని ఏమీ జరగదు" అని. అంచేత సురుచి రాజు ధ్రువుణ్ణి ఒడిలో కూర్చోబెట్టుకోడాన్ని అడ్డగించింది. రాజు రాణికధీనుడు, అతను కామాంధుడు. కాబట్టి అతనాలోచించాడు 'నేను ధ్రువుణ్ణి ఒడిలో కూర్చోబెట్టుకుంటే సురుచి కోపగించుకొంటుంది. ఏమైనా కాని నారాణి కుపితురాలు కాకూడదు". రాజు ధ్రువుని అనాదరంతో, తృణీకారంతో ముఖం త్రిప్పుకున్నాడు. తండ్రి తనను ఒడిలో కూర్చోబెట్టుకుంటాడని ధ్రువునికి చాల ఆశ వుండినది. అతను (ధ్రువుడు) చేయిచాచి నన్ను కూడ నీ ఒడిలో కూర్చోబెట్టుకో' అని అడిగాడు కూడ. సురుచి ధ్రువునితో అన్నది గదా – ఇక్కడి నుండి పారిపో ! రాజుగారి ఒడిలో కూర్చొనే అర్హత నీకు లేదు. నీవు రాజుకు అయిష్టమైనరాణి సునీత బిడ్డవు. కాబట్టి నీవు రాజు ఒడిలో కూర్చొన జాలవు.

ధృవుడంటున్నాడు. అమ్మా అమ్మా ! నేను నా తండ్రి కొడుకును కానా ! –సురుచి "నీ తల్లి రాణి కాదు. నీ తల్లి దాసి, రాజు ఒడిలో కూర్చోవాలని నీవు అనుకుంటే నీవు నా కడుపున పుట్టాల్సి వుంటుంది. నీవు అడవికి పోయి తపస్సుచై, ఈశ్వరుణ్ణి ఆరాధించు, నా కడుపులో పుట్టాలని భగవంతుణ్ణి కోరుకో" అనింది.

భగవంతుడు ప్రసన్నుడంటూ అయితే నీ కడుపులో పుట్టాలని ఏల అడుగాలి? కాని సురుచి మూర్ఖురాలు. కాబట్టి అలా మాట్లాడుతూంది.

తండ్రి కొన్ని క్షణాలైనా ఒడిలో కూర్చుండ బెట్టుకుంటాడని ధ్రువుడు ఆశించాడు. కానీ అలా జరగలేదు. సురుచి చేసిన అవమానానికి ఏడుస్తూ తన తల్లి సునీతి వద్దకు వచ్చాడు.

సునీతి అడిగింది – కుమారా ! ఏల ఏడుస్తున్నావు ? నీకేమైంది? చెప్పు. పిల్లవాడు సంస్కారవంతుడు, కాబట్టి ఏమీ మాట్లాడడం లేదు. కానీ మాటి మాటికీ ఏడుస్తున్నాడు. బుద్ధిమంతుడైన కుమారుడు నా స్థితిని బాగా తెలిసిన వాడని సునీతికి తెలుసు. ఎవని తల్లి సునీతియో అతడు సుశీలుడే అవుతాడు. ఎప్పుడు వంశంలోని అనేకుల పుణ్యం ఒకటిగా చేరుతుందో అప్పుడే పుత్రుడు – కుమారుడు ఉదారుడుగా అవుతాడు.

నేను జరిగినదానినంతా చెప్తే పరంపరా కారణంగా తల్లిదండ్రులను నిందించిన పాపం అవుతుంది అని. ధ్రువుడు ఆలోచించాడు. ఇంతలో ఒక దాసివచ్చి జరిగినదంతా సునీతికి చెప్పింది. విషయాన్నంతా విన్న సునీతి మనస్సులో ఇలా ఆలోచన కల్గింది – నేను సురుచికి ఏలాటి చెడు చేయలేదు. నా నోటి నుండి నా సవతిని గరించి ఏదైనా కఠినపు మాట వెలువడితే ధ్రువుని మనస్సులో వైరభావం – శత్రుభావ సంస్కారం స్థిరంగా – నాటుకపోతుంది. దానిచే భవిష్యత్తులో అనర్థం కలుగుతుంది అని. ఈవిషయంచే సునీతికి చాల దుఃఖం కలిగింది. కానీ ఆమె తన పిల్లవానికి మంచి సంస్కారాలను ఇవ్వదలస్తూంది. ఆమె కోరుకుంటూంది. – నా పిల్లవానికి రాజ్యం, సంపద రాకుండా పోయినా పోనీ, కానీ సంస్కారం మాత్రం మంచిదే కలగాలి అని. తల్లి సునీతి అయితే తన పిల్లవానికి వెయ్యిమంది ఉపాధ్యాయుల ఆపేక్ష్య తానే అధికమైన మంచి విద్యాబుద్ధులను ఇవ్వగలదు.

సునీతి దుఃఖం యొక్క వేగాన్ని దిగమింగుకొని ధైర్యంగా ఇలా అనింది – అబ్బాయీ ! నీ సవతి తల్లి ఏమీ చెడు చెప్పలేదు. ఆమె నీ కిచ్చిన ఉపదేశం మంచిది. నేను కూడ నీకు ఇదే ఉపదేశాన్ని ఇస్తున్నాను. కుమారా ! భిక్ష అడగాల్సి వస్తే భగవంతుణ్ణే ఎందుకు అడగకూడదు ? మానవుణ్ణి చాలాసార్లు అడిగినప్పటికి అతని నుండి చాల తక్కువగానే లభిస్తుంది. అంతేకాదు అనేకమార్లు అవమానం, లేక ఉపేక్షయే లభిస్తుంది, అంచేత భగవంతుణ్ణే అడుగు. భగవంతుడిస్తే జీవుడు దానినంతా తీసుకోలేనంత అధికంగా ఇస్తాడు. అబ్బాయీ ! భగవంతుడు నీపై కృప చూపిస్తాడు, నిన్ను ప్రేమతో పిలుస్తాడు, ఒడిలో కూడ కూర్చుండబెట్టుకుంటాడు. నీకే కాదు ప్రాణిమాత్రునకు నిజమైన తండ్రి పరమాత్మే.

నేను నిన్ను నారాయణునకు అప్పగించాను. ఏ తండ్రి నీ ముఖం కూడ చూడ ఇష్టపడలేదో అతని ఇంటిలో పడివుండడం నిరర్థకం. ఈ ఇంటిలో నీవు వుంటే నీసవతితల్లి ఎల్లప్పుడూ నీకు కష్టం కలుగజేస్తుంది. కానీ నీవు ఏడ్వవద్దు. నీవు ఏడిస్తే నాకున్ను దుఃఖమే కల్గుతుంది. నీ సవతి తల్లి నిన్ను అడవికి పొమ్మని చెప్పిందే. సరిగానే చెప్పింది. ఇందులో నీకు కళ్యాణం – శుభం జరుగుతుంది.

" ఆరాధయ అధోక్షజపాదపద్మౌ. యదీచ్ఛసే ఆధ్యాసన ముత్తమో యథా "– నీవు ఉత్తమునివలె రాజసింహాసనంపైన కూర్చోవలి అని కోరుతూవుంటే భగవంతుని పాదపద్మములను ఆరాధించు. "అనన్యభావే నిజధర్మ భావితే మనస్యవస్థాప్య భజస్వ పూరుషమ్ ". (4–8–22)– స్వధర్మపాలనం ద్వారా పవిత్రమైయున్న నీ చిత్తంలో పురుషోత్తముడైన భగవంతుని స్థాపించు. తదితర చింతనలను అన్నిటిని వదలి కేవలం ప్రభు భజననే చై " ఇక ఈ ఇంటిలో వుండొద్దు. అడవికి పోయి నారాయణుని భజించు.

ధ్రువుడంటున్నాడు – సవతితల్లి మనిద్దరిని అవమానించింది. ఈ యింటిలో నాకు గౌరవం లేదు. సరికదా నీకూ గౌరవం లేదు, మనం ఇద్దరమూ అడవికిపోయి భగవద్భజన ఏలచేయకూడదు ?

(సశేషం)

శ్రీ మలయాళస్వామి జీవిత విశేషాలు - 3

ధ్యాననిష్ఠ

- డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

అప్పుడు నేను వ్యాసాశ్రమంలో విద్యార్థిగా ఉన్నాను. నిత్యమూ పూజా మందిరంలో సాయం సమయంలో భజన జరిగేది. విద్యార్థులందరూ అందులో పాల్గొనేవారు. భజన పూర్తి అయ్యేసరికి నిష్ఠాశ్రమం (నేటి అధిష్ఠాన మందిరం) నుండి శ్రీస్వాములవారు పూజా మందిరానికి వచ్చేవారు. ఆశ్రమ సందర్శనానికి విచ్చేసిన భక్తులకు దర్శనం అనుగ్రహించేవారు. సా॥ 7.30 కి అందరికీ భోజనశాలలో భోజనం ఏర్పాట్లు జరిగేవి.

ఒకరోజు ఒక భక్తుడు సాయంకాలం 6 గంటలకు ఆశ్రమానికి వచ్చాడు. " శ్రీస్వాములవారిని సందర్శించాలి. వారెక్కడ ఉంటారు?" అని అడిగాడు. "శ్రీవారు ఇప్పుడు నిష్ఠాశ్రమంలో ఉంటారు" అనిఒక విద్యార్థి చెప్పాడు.

"అక్కడ ఇప్పుడు ఏమి చేస్తుంటారు?" అని మళ్ళీ భక్తుని ప్రశ్న. ఇప్పుడక్కడ స్వామీజీ ధ్యాననిష్ఠలో వుంటారు. ఏడు గంటలు దాటిన తరువాత పూజా మందిరానికి వస్తారు. అప్పుడు భక్తులకు దర్శనమిస్తారు? " అని సమాధానం.

అది విన్న తరువాత ఆ భక్తునికి సందేహం కల్గింది. "శ్రీ మలయాళస్వాములవారు తిరుమల గోగర్భక్షేత్రంలో పండ్రెండు సంవత్సరాలకు పైగా ధ్యాననిష్ఠలో ఉండినారని తెలిసింది. వారి తపస్సు ఫలించి అక్కడనే వారికి ఆత్యంతిక దుఃఖ నివృత్తి, పరమానంద ప్రాప్తి కలిగిందని చెప్పగా విన్నాము. అలాంటప్పుడు ఇప్పుడు మళ్ళీవారు ధ్యాననిష్ఠలో ఉండడమేమిటి ? ధ్యానం సాధకులకే కదా ! సిద్ధ స్థితి నందుకొన్న వారికెందుకు ? " అని అతని సందేహం.

ఇంతలో ఏడు గంటలయంది. శ్రీవారు పూజా మందిరానికి వచ్చారు. భజన కూడా ముగిసింది.

ఆ భక్తులు శ్రీస్వాములవారిని సందర్శించుకొన్నాడు. ఆపై స్వామీజీని ఇలా ప్రశ్నించాడు. "స్వామీ ! ఇక్కడివారు మీరు ఇప్పటి వరకూ నిష్ఠాశ్రమంలో ధ్యాననిష్ఠలో ఉన్నారని చెప్పారు. మీ ధ్యాననిష్ఠ తిరుమలలోనే ఫలప్రదమయింది కదా ! మీరింకా ధ్యాననిష్ఠలో ఉండడమేమిటి ? దయతో తెలియజేయండి !"

అది విని శ్రీవారు చిరునవ్వు నవ్వి ఆ భక్తునితో ఇలా అన్నారు.

" నాయనా ! మీరు ధర్మస్థలం దర్శించారా ? దర్శించి వుంటే అక్కడి విశేషమేమిటో చెప్పండి !"

"స్వామీ ! ధర్మస్థలం దర్శించాను. అక్కడ అన్నదాన కార్యక్రమం సదా కొనసాగుతూ వుంటుంది. అదీ అక్కడి విశేషం."

" నాయనా ! నిత్యాన్నదానం జరగాలంటే అక్కడ నిత్యం వంటలు వండుతూనే వుండాలి కదా ! అక్కడ వంటలు వండే వారిని మీరింకా వంటలు వండుతూనే వుంటే తినేదెప్పుడు? " అని ప్రశ్నించి చూడండి!

" మేము ముందుగానే తిన్నాము. వేలాదిగా ఇక్కడికి వచ్చే భక్తులకొరకై వండుతున్నాము". అని సమాధానమిస్తారు.

అట్లే మేము తిరుమలలోనే ధ్యానసిద్ధి పొందాము. అయినా అనుదినం ఇక్కడికి వచ్చే భక్తుల కొరకై, వారికి ఆదర్శంగా వుండడానికై ధ్యాన నిష్ఠలో వుంటాము. ఇతరులకు మార్గదర్శకమైన ఆచరణ ఎన్నడూ విడువరాదు. జ్ఞాని లోకశ్రేయస్సుకు భంగకరంగా ప్రవర్తించగూడదు. జ్ఞాని కావించే ధ్యాననిష్ఠ మున్నగు సాధనలు ఇతర సాధకులకు ఎంతగానో ఉపకరిస్తాయి ".

అది విని ఆ భక్తుడు నిరుత్తరుడయ్యాడు. సమయోచితమూ, అర్థవంతమూ అయిన స్వామి సమాధానం అతనికి సంతృప్తితోపాటు

సంతోషం కూడా కల్గించింది.

శ్రీ కృష్ణుడు గీతలో "అర్జునా ! ముల్లోకాలలోనూ నాకు ఇక చేయవలసింది ఏదీ లేదు. పరిపూర్ణుడనైన నేను ఇక క్రొత్తగా పొందవలసింది కూడా ఏదీ లేదు. అయినా నేను కర్మలు ఆచరిస్తూనే వుంటాను. పార్థా ! నేను కర్మలు ఏమరుపాటు లేకుండా చేయకపోతే ప్రజలందరూ నన్నే ఆదర్శంగా గ్రహించి నా బాటలోనే నడుస్తారు. అలా వారంతా కర్మ రహితులై పోతారు సుమా !"అని బోధించాడు.

" నమే పార్థాస్తి కర్తవ్యం త్రిషులోకేషు కించన ।
నానవాప్త మవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి ॥
యదిహ్యహం న వర్తేయం జాతు కర్మణ్యతంద్రితః ।
మమ వర్త్మానువర్తనే మనుష్యాః పార్థ! సర్వశః"
(భగవద్గీత 3-22,23)

మళ్ళీ శ్రీకృష్ణ పరమాత్మ ఇలా చెప్పారు.

" ఉత్సీదేయురిమే లోకా న కుర్యాం కర్మచే దహమ్ ।
సంకరస్యచ కర్తా స్యాముపహన్యా మిమాః ప్రజాః (గీత 3-24)

"నేను కర్మ చేయకుంటే ఈ లోకాలు ఉనికి లేనివై పోతాయి. పైగా నేను సంకరానికి కర్తనవుతాను. అందువల్ల నేను తప్పక కర్మలు చేయవలసిన అవసర మేర్పడింది."

ఇది భగవంతుని మాట. దీన్ని మనం శ్రీమలయాళ సద్గురు దేవులకు గూడా అన్వయించవచ్చు. వారు సోమరితనాన్ని సహించేవారు కారు. "సోమరుల కెచ్చటనూ మోక్షం లేదు " అని ఆశ్రమ విద్యార్థులచేత ప్రతి దినం పూజా మందిరం వద్ద ఘోషింప జేసేవారు.

శ్రీ శివానందస్వాములవారు ''భగవద్గీతకు భాష్యమే శ్రీమలయాళస్వామి జీవితము " అని చెప్పారు. స్వామి అనుష్ఠానాన్ని గీతతో సమన్వయించవచ్చు. మహనీయులు చూపిన మార్గమే అందరికీ అనుసరణీయం.

జ్ఞాన సుధ

అనువాదం :
శ్రీ శంకరానందగిరి స్వాములవారు
(ఉమామహేశ్వర పీఠాధిపతులు)

మూలం
శ్రీ సర్వభూషణ శివయోగి వారు

జ్ఞానోపాసనా సముచ్చయ నిరాకరణాత్మక

షష్ఠాధ్యాయము

అవ : జ్ఞానకర్మ సముచ్చయము ఘటిల్లనట్లు జ్ఞానోపాసనా సముచ్చయమును సంభవింపదని విశదపఱచుచున్నారు -

నిష్ఠార్థం మందపుంసాం దృషది హరిహరాద్యాక్రియా వ్యజ్యతే తే దేవా స్సంత్యూర్ధ్వలోకే తదఖిలజగ దేతే ఽ త్రమధ్యే ఽ బ్జజాండమ్
ఇత్థం బ్రహ్మాండషండం పరిణమతి శివే యత్ర వాచా మభూమౌ సో ఽ హంభావం స్వయం మే హృదయ మిహ న తద్ గాహతే కిం కరోమి ॥ ౪౬

మందపుంసాం = మందబుద్ధులకు, నిష్ఠారం = నిష్ఠ (శ్రద్ధ) కుదురుటకై, దృషది = శిలయందు, హరి హర ఆది ఆక్రియా = శివకేశవాదుల ఆకారము, వ్యజ్యతే = వ్యక్తము చేయబడుచున్నది. తే దేవాః= ఆ దేవతలు, ఊర్ధ్వలోకే = పై లోకమునందు, సంతి= ఉండెదరు. తత్ అఖిల జగత్= అట్టి ఊర్ధ్వాదిలోక రూపమైన సమస్త జగత్తు, అత్ర=ఈ లోకమునగల,ఏతే= ఈ సమస్త ప్రాణులును, మధ్యే అబ్జజాండం= బ్రహ్మాండ మధ్యమున, (సంతి = నివసించుచుందును.)ఇత్థం =ఇట్లే, బ్రహ్మాండ షండం = పెక్కు బ్రహ్మాండముల సమూహము, యత్ర= ఏ, వాచాం అభూమౌ= వాక్కులకు, నెలవుకాని, వాక్కులకందని, శివే = శివునియందు, పరమాత్మయందు, పరిణమతి= పరిణమించుచున్నదో,

జనన మరణాది రూపమైన పరిణామమును బొందుచున్నదో, సోऽహం భావం = ఆ శివుడే నేనను భావముగలదియై, స్వయం = స్వతః, మే= నాయొక్క, హృదయం= హృదయమున్నది. ఇహ= ఇచ్చట, ఇట్టి నా హృదయమున, తత్ = ఆ మందబుద్ధుల నుద్దేశించి విధింపబడిన నిష్ఠ, శ్రద్ధ, నగాహతే = ప్రవేశింపకున్నది, కిం కరోమి= ఏమి చేయుదును?

జ్ఞాని కర్మలను త్యాగము చేసిన చేయుగాక, హరి హరాది దేవతోపాసనను విడుచు టెట్లు ? ఆ దేవతానుగ్రహము వలననే కదా మనుజుడు జ్ఞానము గలవాడగును? అనిన సమాధానము చెప్పుచున్నారు. మందబుద్ధుల నుద్దేశించి భక్తి శ్రద్ధలు కుదురుటకై శిలాదులయందు హరిహరాది దేవతల యాకారము చూపబడుచున్నది. ఆ దేవతలు ఊర్ధ్వలోకమునందుందురు. అట్టి ఊర్ధ్వలోకము, అందలి దేవతలు, ఈ లోకము, ఇందలి ప్రాణులు బ్రహ్మాండమునడుమ నుండుచున్నవి. అట్టి బ్రహ్మాండములు అనేకములు ఏ శివునియందు పరిభ్రమించు చున్నవో, అవాఙ్మానసగోచరుడైన ఆ శివుడే నేననెడి భావము గలిగి స్వతః నా హృదయ మున్నది. ఇట్టి నా హృదయమున మందబుద్ధులకోసము ఏర్పఱచిన ఆ యుపాసనా విధానము ప్రవేశింపకున్నది. నేనేమి చేయుదును ? సకల దేవతలయు, సమస్త లోకములయు, సమస్త ప్రాణులయు సత్త బ్రహ్మసత్తయే. ఏకము, అద్వితీయము నగు ఆ సత్త జ్ఞానిస్వరూపమేయై యున్నది. అనగా " సచ్చిదానంద పరశివుడనే నేను, నాకంటే భిన్నము అనంతము లేదు. నేనే అద్వితీయ మగు దృక్కు" అనునట్టి దృష్టితో కృతకృత్యుడైన జ్ఞానికి ధ్యానాది కర్తవ్యము లేదని భావము. "అఖండం ఖండ్యతే కథమ్, నిర్లజ్జం ధ్యాయసే కథమ్ " అని శ్రీ గురు దత్తాత్రేయవాక్యము **(అవధూతగీత).**

కథాత్మక గీతా సూక్తులు

– ఆచార్య కె. సర్వోత్తమరావు, తిరుపతి

(గత సంచిక తరువాయి)

న మే భక్తః ప్రణశ్యతి

ఈ గీతావాక్యం తొమ్మిదో అధ్యాయమయిన రాజవిద్యారాజ గుహ్య యోగంలో ముప్పయి ఒకటో శ్లోకభాగం.

' నా భక్తుడు ఎన్నటికిని చెడిపోడు' అని భావం. ఈ భావాన్నే పురందర దాసులవారు 'నంబి కెట్టవరిల్ల' నమ్మి చెడ్డవాళ్ళెవరూ లేరు. నమ్మకనే చెడ్డారని వ్యాఖ్యానించారు.

భగవంతుని చేరడానికి అనేక మార్గాలున్నాయి. వాటిలో ప్రధానమయినవి జ్ఞాన, కర్మ, యోగమార్గాలు. అయితే కలియుగంలో సర్వేశ్వరుని చేరడానికి 'భక్తి' సులభోపాయంగా పెద్దలు సూచించారు.

భక్తి మార్గానికి స్త్రీ పురుషభేదం లేదు. పండితపామరభేదం లేదు. ఉచ్చ నీచాది ప్రభేదాలు లేవు. స్త్రీ తిర్యగ్జడాది విభేదాలు లేవు. ఆయా జీవుల సంస్కారాల బట్టి భక్తి తరణోపాయంగా భావించినవారికి ముక్తి కరతలామలకం... మన పురాణాలలో భక్తుల చరిత్రలు కోకొల్లలు.

శ్రీకాళహస్తీశ్వరుని సేవించి సాలెపురుగు, ఏనుగు, పాము శివసాయుజ్యం చేరుకొన్నాయి. కుమ్మరివాడయిన కురువరతినంబినే శ్రీ వేంకటేశ్వరుడు తొండమాన్‌చక్రవర్తి కంటె ఉన్నత భక్తుడుగా ప్రశంసించాడు. నమకచమకాదులతోడి అభిషేకం కంటె నోటితో పుక్కలించిన స్వర్ణముఖీ జలమే, తిన్నని పూజయే శ్రీకాళహస్తీశునికి ప్రియమయింది.

శ్రవణం వల్ల పరీక్షిత్తు, కీర్తనం వల్ల అన్నమయాదులు, స్మరణం వల్ల అజామిళాదులు, పాదసేవనం వల్ల లక్ష్మీదేవి, దాస్యం వల్ల గరుత్మంతుడు, సఖ్యం వల్ల అర్జునుడు విష్ణులోకం చేరుకొన్నారు.

భక్తికి సత్సాంగత్యమనేది పుష్పానికి పరిమళం లాంటిది. శాపవశాన ఇంద్రద్యుమ్నుడు ఏనుగుగా, అతని శత్రువు మొసలిగాను పుట్టారు. హోరాహోరి పోరాటాలలో ఏనుగు కృశించింది. పూర్వజన్మ సాంగత్యం వల్ల బుద్ధి పరమాత్ముని వంక ప్రసరించడం వల్ల శాపవిముక్తి అయింది. తులాధారుడు నారద సాంగత్యం వలన పవిత్రుడయ్యాడు. ధర్మవ్యాధుడు నీచవృత్తిలో జీవిస్తున్నా పూర్వజన్మలో వైష్ణవుడైన రాజుతో కలిగిన సాంగత్యం వలన అతడు సిద్ధిపొందాడు. గోపికలు విద్యావంతులు కారు. ఎటువంటి శుశ్రూషలు తెలియని వారు. ఉపదేశాలు పొందలేదు. కేవలం భగవానుని సాంగత్య ఫలమే వారిని దరిచేర్చింది. ఆలాగే చాతుర్మాస్యవ్రత దీక్షకోసం ఒకచోట చేరిన జ్ఞానులకు శుశ్రూష చేసిన బాలుడు తరువాత జన్మలో నారదుడయ్యాడు.

భక్తులందరు బాధలు పడ్డవారే. కన్నతండ్రి వల్ల ప్రహ్లాదుడు, చక్రవర్తుల వల్ల అన్నమయ్య, పోతనాదులు, సోదరుల వల్ల త్యాగయ్య, తమ ఆడవారి వల్లన అక్కమహాదేవి, మఱది వలన మీరా, ఊరివారివల్ల తరిగొండ వెంగమాంబలు ఇబ్బందులకు గురి అయినవారే. వీరిలో ఒకరి వృత్తాంతం మాత్రం సమన్వయించుకొందాం.

వెంగమాంబ దురదృష్టవశాన విధవ అయింది. గ్రామీణులు ఆమె తనకాలంనాటి విధవావేషపాలన చేయవలసిందిగా కట్టడి చేశారు. కాని వెంగమాంబ తాను 'సుమంగళి' అంది. శ్రీనివాసుడే తన పతి అంది. చివరకు పుష్పగిరి మఠాధిపతులు రానే వచ్చారు. దేశకాలోచితవేషం తగును కదా అని అనుశాసించారు. కాని వెంగమాంబ వినలేదు. చివరకు మఠాధిపతులకు నమస్కారం చేయకపోవడాన్ని విప్రగణం వేలెత్తి చూపింది. చివరకు వెంగమాంబ స్వాములవారిని పక్కకు తప్పుకోమని చెప్పి నమస్కరిస్తే సింహాసనం కాలిపోయింది. అలాగే తిరుమలలో ఇరుగు పొరుగు వారు అనేకరకాలుగా ఇబ్బందులు పెడుతుంటే 'మీ వంశం నిర్వంశమవుతుందని' శపించింది. స్వామికి ఏకాంతసేవలో ముత్యాలహారతి సమర్పించడానికి ఆనాటి వైఖానసులు తిరస్కరిస్తే మరుసటి రోజు వెంగమ్మ ఇంటి దగ్గర రథం ఆగిపోయింది.

వెన్న కాస్తే గాని నెయ్యి కానట్లు అడ్డంకు లెదురయితేగాని గమ్యం చేరుకోలేదు. దిక్కులేని వారికి దేవుడే దిక్కు, దేవుడు ఉపకారి. అపకారి కాడు. పుట్టించిన వాడు పూరివేయక మానడు లాంటివి ప్రసిద్ధాలు. ఇతర దేశస్థులకంటె స్వామిపై ఆధారపడడం భారతీయుల విశ్వాసానికి గుర్తు.

క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాన్తిం నిగచ్ఛతి
కౌన్తేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి

ఘుగర్ వ్యాధికి బెండకాయలు

రెండు బెండకాయలను తీసుకొని వాటి కొనలను రెండు వైపులా కోయాలి. మధ్యలో కూడా చిన్నగా కోసి, వాటిని నీరు ఉన్న గ్లాసులో రాత్రంతా మూత మూసి ఉంచాలి. తెల్లారిన తర్వాత బ్రేక్‌ఫాస్టుకు ముందు, గ్లాస్‌లోని బెండకాయలను తీసి, ఆ నీటిని తాగాలి.

అలా రెండు వారాలపాటు ప్రతిరోజూ తాగితే, ఘుగర్ చాలా వరకు తగ్గుతుంది.

హెల్పింగ్ హ్యాండ్స్ - దిల్‌సుఖ్‌నగర్, హైద్రాబాద్ వారు "త్రినేత్ర వైద్యాలయ ట్రస్టుకు " లక్షా పదివేల రూపాయలు సమర్పించారు.



శివమహిమ్నస్తోత్రం

(గత సంచిక తరువాయి) - శ్రీ మధుసూదనీటీక

- అనువాదకులు శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు

అవతారిక - ప్రశ్న : లోకములో యెవరినైనా ప్రసన్నము చేసికోవడానికే ప్రశంసారూపస్తుతి చేయబడుతుంది. నీవు మహాదేవుని స్తుతించి ఆకర్షించుకోవాలనుకుంటున్నావా ? పుష్పదంతుడు జవాబు చెపుతూ - నేను పరమశివుణ్ణి వాక్చాతుర్యంతో ఆకర్షించుకోవడానికి స్తుతించడము లేదు, మరేమనగా నా యొక్క వాణిని పవిత్రము జేసుకోవడానికే స్తుతి చేయుచున్నాను. “ శ్రీనాథు’ వర్ణించు జిహ్వా జిహ్వా

మ.టీ నన్వేవం స్తుత్యత్వే ఽపి హరి హర సర్వజ్ఞయోజనభినవయోస్తుత్యా న మనోరంజనం, తద్వినా న తత్ప్రసాదస్తం వి నాన ఫలమితి పునరపి స్తుతేర్వైయర్థే ప్రాప్తే సార్థక్యం దర్శయన్ స్తౌతి.

అను : యద్యపి, భక్తులను అనుగ్రహించుటకోసము ధరించబడిన నూతన స్వరూపమునాశ్రయించుకొని భగవంతుని స్తుతించుట, సంభవించవచ్చును.కాని శ్రీహరి మరియు మహాదేవుడు ఇద్దరూ సర్వజ్ఞులు, కావున నీవు చేయబోవు స్తుతిని వారు పూర్వమే యెరుగుదురు. అందువలన నీ స్తుతి వారికి క్రొత్తది కాదు. మనోరంజనహేతువు కానేరదు. మనస్సు రంజిల్లనిచో వారు ప్రసన్నులు కారు. ప్రసన్నతా వినా నీ స్తుతి నిష్ఫలమగును. ఇట్లు స్తుతి వైయర్థ్యాపత్తి ప్రాప్తించినపుడు శ్రీ గంధర్వరాజు ప్రకారాంతరముచే స్తుతి సాఫల్యమును చూపెడుతూ భగవంతుని స్తుతిస్తున్నాడు.

మధుస్ఫీతా వాచః పరమమమృతం నిర్మితవత

స్తవ బ్రహ్మన్ కిం వాగపి సురగురోర్విస్మయపదమ్ ।

మమ త్వేతాం వాణీం గుణకథనపుణ్యే న భవతః,

పునామిత్యర్థే ఽస్మిన్ పురమథన బుద్ధిర్వ్యవసితా ॥3॥

ప్ర.ప. : బ్రహ్మన్ = ఓ బ్రహ్మస్వరూపుడవగు మహాదేవ ! మధుస్ఫీతాః = తేనియలవలె అత్యంత మధురమైన, పరమమ్ = సర్వోత్కృష్టము, అమృతమ్ = అమృతమయ, వాచః = వాణిని, నిర్మితవతః = నిర్మాణము చేయగల, తవ= నిన్ను, కింసురగురోః=ఏమి దేవగురువగు బృహస్పతి యొక్క, వాక్ అపి = వాణి గూడ, విస్మయపదమ్ = చమత్కృతము చేయగలుగునా ? తు= కాని, పురమథన = హేత్రిపురనాశక ! భవతః = పుణ్య చరితుడివగు నీయొక్క, గుణకథన పుణ్యేన = మహిమను కీర్తించుటచే కల్గిన పుణ్యము ద్వారా, ఏతాం వాణీమ్ = నా ఈ వాణిని, పునామి = పవిత్రము చేసికొనుచున్నాను, ఇతి = ఇందువలన, అస్మిన్ అర్థే = ఈ గుణకథన రూప ప్రయోజనము నందు, మమ బుద్ధిః = నా యొక్క బుద్ధి, వ్యవసితా = తత్పరమైనది.

భావార్థము : హే బ్రహ్మన్ ! హే పురమథన ! తేనె కలిసినట్లు అత్యంత మధురమైన, సర్వోత్కృష్టమైన మరియు అమృతస్వరూపమైన వేదవాణిని రచించిన నిన్ను సురగురు బృహస్పతియొక్క వాణి గూడ విస్మయ మొందింప జేయునా ? (ఆశ్చర్య చకితున్ని జేయునా ?) అనగా ఎప్పుడు గూడ చేయలేదు. అట్లగుచో నా యొక్క అల్పమగు వాణి (స్తుతి) నిన్ను చమత్కృతము జేయునా ? సంభావనయే లేదు. అయినా గూడ నా బుద్ధి, నీయొక్క పరమ పవిత్రమైన గుణానువాద జనిత పుణ్య ప్రభావముచే అపవిత్రమగు నా వాణిని పవిత్రము జేయుటకు నీ గుణ కథన రూప స్తుతియందు తత్పరమగుచున్నది.

శ్రీ మదాంధ్ర మహా భాగవతము

- ఆచార్య జక్కంపూడి మునిరత్నం (తిరుపతి)

(గత సంచిక తరువాయి)

పరీక్షిత్తు పరిపాలన : పరీక్షిత్తు ఉత్తములైన విప్రుల దగ్గర విద్యను అభ్యసించాడు. యుక్త వయస్సు రాగానే ఉత్తరుడి కుమార్తె ఇరావతిని వివాహం చేసుకున్నాడు. ఆ దంపతులకు జనమేజయుడు మొదలైన నలుగురు కుమారులు జన్మించారు. కృపాచారి పర్యవేక్షణలో గంగానదీ తీరంలో మూడు అశ్వమేధ యాగాలు చేశాడు. బ్రాహ్మణులకు గొప్పగా దక్షిణలిచ్చాడు. దేవతలు ప్రత్యక్షంగా వచ్చి హవిర్భాగాలు పుచ్చుకున్నారు.

పరీక్షిత్తు దిగ్విజయ యాత్రకు బయలుదేరాడు. దిక్కులన్నీ జయించుకుంటూ వెళ్ళుతున్నప్పుడు అతనికి కలిపురుషుడు తారసపడ్డాడు. అతడు రాజచిహ్నాలు ధరించి శూద్రవేషంలో ఉన్నాడు. ఒక ఆవును, ఎద్దును తన్నుతూ కనిపించాడు. పరీక్షిత్తు అతన్ని శిక్షించాడు.

సూతుడు ఇలా చెప్పగానే శౌనకుడు అతనికి అడ్డు తగిలాడు. "సూతమహర్షీ ! కలిపురుషుడు ఆ ఆవును, ఎద్దును ఎందుకు తన్నాడు ? పరీక్షిత్తు కలిని ఏవిధంగా శిక్షించాడు. నాకు వివరంగా చెప్పు. విష్ణుభక్తులు ఉత్తములు. వారి చరిత్రలనే వినాలి. అలాకాక సంసార వ్యామోహంలోపడి చెడ్డవాళ్ళ చరిత్రలను వినడం సమంజసం కాదు. బ్రతుకు శాశ్వతం కాదు. మరణం రావడం వాస్తవం. ఈ సత్యాన్ని తెలుసుకొని మోక్షాన్ని కోరుకుంటున్నాం. మేము తక్కువ ఆయుర్దాయం కలవాళ్ళం. చెడ్డవాళ్ళను గురించి వింటూ బంగారు వంటి జీవిత కాలాన్ని పాడు చేసుకోవడం ఎందుకు ? కాబట్టి గోవింద పదారవింద మకరందాన్ని మాకు అందించు. సత్రయాగానికి రమ్మని మునీంద్రులు ఆహ్వానించగా యముడు కూడా

వచ్చాడు. ఈ యాగం పూర్తయ్యే దాకా ఒక్కరి ప్రాణం కూడా తీయకుండా విష్ణుకథలు వింటూ ఉన్నాడు. మందబుద్ధి కలవాళ్ళకు, సోమరిపోతులకు, అల్పాయుర్దాయం కలవాళ్ళకు, పనికిమాలినదారులు పట్టుకొని తిరిగే వాళ్ళకు గోవింద పదారవింద మకరందాన్ని పానం చేసే తీరిక ఉండదు."

సూతమహర్షి శౌనకుడి మాటలకు సంతోషించాడు. మళ్ళీ చెప్పడం మొదలెట్టాడు. "పరీక్షిత్తు మహారాజు తాను రక్షిస్తున్న కురుజాంగలదేశంలో కలిపురుషుడు ప్రవేశించాడని విన్నాడు. వాడి పని పట్టాలనుకున్నాడు. విల్లుచేతబట్టాడు. సింహధ్వజం కట్టిన రథాన్ని అధిరోహించాడు. నలుదిక్కుల్లోని రమ్యకం, హిరణ్మయం, హరివర్షం, కింపురుషం, భద్రాశ్వం, కేతుమాలం, భారతవర్షం అనే దేశాలను, ఉత్తర కురుదేశాలను జయించాడు. ఆయా దేశవాసులు సమర్పించిన కానుకలందుకున్నాడు. వందిమాగధులు పూర్వ రాజుల వృత్తాంతాలను గానం చేస్తే విన్నాడు. వారు చదివిన పద్యాల ద్వారా శ్రీకృష్ణుడు అనేక విధాలుగా తమ కుటుంబానికి చేసిన సహాయాలను తెలుసుకున్నాడు. కృష్ణుడే అశ్వత్థామ బాణం నుంచి తనను రక్షించాడనే విషయం తెలుసుకున్నాడు. యాదవ పాండవుల అనుబంధాన్ని అర్థం చేసుకున్నాడు. ఎంతో విలువైన బహుమానాలు ఇచ్చాడు.

ధర్మ దేవుడు ఒంటికాలితో నడిచే వృషభాకారంతో కనిపించాడు. దూడను వీడిన పాడి ఆవును తలపిస్తూ భూదేవత గోరూపాన్ని ధరించింది. ఆమె కళ్ళ వెంట నీళ్ళు కారుతున్నాయి. ధర్మదేవుడు భూదేవిని చూసి బాధపడ్డాడు. అతని నోటి నుండి ఒకదానివెంట ఒకటిగా ప్రశ్నలు వెలువడ్డాయి. 'అమ్మా ! నీ కళ్ళ నుంచి ఎందుకిలా నీటిధారలు కారుతున్నాయి? జబ్బున పడినట్టు ఎందుకు నీ శరీరం కనిపిస్తూ ఉంది ? ఎందుకు నీ ముఖం వాడిపోయింది? ఎందుకలా ఉన్నావ్? నీ ఆత్మీయులకు

అనిష్టమేదీ జరగలేదు కదా ? ఒంటికాలితో తిరుగుతున్న నన్ను పట్టి బంధిస్తారేమోనని భయపడుతున్నావా తల్లీ ? ఎందుకిలా ఉన్నావమ్మా ?

రాబోయే కాలంలో యజ్ఞాలు ఉండవు. అందువల్ల దేవతలకు హవిర్భాగాలు లభించవు. భర్తలు భార్యలను భరించరు, పిల్లలు తల్లిదండ్రులను పోషించరు. సరస్వతి చెడ్డవారిని ఆశ్రయిస్తుంది. బ్రాహ్మణులు రాజులకు సేవచేసి జీవిస్తారు. యజ్ఞాలు లేకపోవడం వల్ల ఇంద్రుడు వర్షాలు కురిపించడు. దానితో ప్రజలు నానా ఇబ్బందులు పడతారు. వీటన్నిటినీ తలచుకొని బాధపడుతున్నావా అమ్మా? ఎందుకు నీకీ ఆవేదన ?

కృష్ణుడు అవతారం చాలించాడు కదా, నేను దిక్కులేని దాన్నై పోతానేమోనని బాధపడుతున్నావా ? ఎలాంటి దుర్మార్గుల పాలన వస్తుందో? ఎటువంటి కష్టాలు కలుగుతాయో అని ఆక్రోశిస్తున్నావా ? అమ్మా ! నువ్వు కృష్ణుడు ఇక్కడున్నంతవరకు దేవతలు కూడా కొనియాడదగిన సౌభాగ్యంతో విరాజిల్లావు. ఇప్పుడది కాస్త అనర్థం పాలైంది.

ధర్మదేవత మాటలకు స్పందిస్తూ భూదేవి కూడా చెప్పడం ప్రారంభించింది. ' ఓ ధర్మదేవతా ! ఒకప్పుడు నువ్వు నాలుగు పాదాలతో ఈలోకంలో నడిచేవాడివి. ఇప్పుడు ఆ కృష్ణుడు లేకపోవడం వల్ల కాల ప్రభావానికి లోబడి ఒక పాదంతోనే నడుస్తున్నావు. ఆ మహానుభావుడు ఎన్నో మంచి గుణాలకు ఆలవాలం.కృష్ణుడు అవతారం చాలించగానే కలిపురుషుడు ప్రేరణతో ప్రజలు పాపకృత్యాలకు పాల్పడుతున్నారు. దీన్ని చూస్తే నాకు దుఃఖం ఆగడం లేదు. దేవతలకూ, పితృ దేవతలకూ, ఋషులకూ, నాకూ, నీకూ, వర్ణాశ్రమాలకూ, గోవులకూ, గొప్పవాళ్ళకూ బాధలు కలుగుతున్నాయి. ఇదే నా బాధకు కారణం. పద్మ, వ్రజ, శంఖ, చక్ర, చాప, మీన, ధ్వజరేఖలతో ఉన్న ఆ వాసుదేవుడి పాదాలు నా శరీరానికి ఇకమీద సోకవు కదా అనుకుంటే శోకం కలుగుతూ ఉంది, మాధవుడి మధురమైన మాటలు, ఆ నయగారాలు, ఆ చిరునవ్వులు, ఆ కనికరాలు, ఆ ముద్దు మురిపాలు, ఆ ప్రణయ కలహాలు ఎవ్వరూ మరచిపోలేరు.

సరస్వతీ నదీ తీరంలో భూదేవీ ధర్మ దేవతలీవిధంగా మాట్లాడుకుంటున్నప్పుడే పరీక్షిత్తు మహారాజు అక్కడికి వచ్చాడు. ఇంతలో కలిపురుషుడు వేగంగా అక్కడికి వచ్చి ఆ వృషభాన్ని తన్నాడు. ఆ తాపుకు తట్టుకోలేక ఆ వృషభం కిందపడి మూత్ర విసర్జన చేసింది. ఆ గోవును కూడా తన్నాడు. పరీక్షిత్తు ఆ దృశ్యాన్ని చూశాడు. విల్లెక్కుబెట్టాడు. కలిపురుషుడు అకృత్యాన్ని అధిక్షేపించాడు. తీవ్రంగా దుయ్యబట్టాడు. రాజదండన తప్పదని హెచ్చరించాడు. గో వృషభాలను ఓదార్చాడు. నిరపరాధులైన సాధు జనులను బాధించే దుర్మార్గులను శిక్షించడం రాజు కర్తవ్యము. అలా చేయనివాడి జీవితమూ, ఆయుస్సూ, ఐశ్వర్యమూ అన్నీ వ్యర్థమే. చెడ్డవారిని శిక్షించేందుకూ, మంచివారిని రక్షించేందుకూ బ్రహ్మదేవుడు రాజులను సృష్టించాడని శాస్త్రవేత్తలు చెబుతారు. రాజునైన నేను ఈ దుర్మార్గుణ్ణి శిక్షిస్తాను. కాబట్టి రాజైన నాకు ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే పరమధర్మము. దుర్మార్గుడైన కలిని శిక్షిస్తానన్నాడు. మునుపటిలాగానే ధర్మాన్ని నాలుగు పాదాలతో నడిపిస్తాను. ధర్మం మూడుపాదాలను లేకుండా చేసిన వారి హస్తాలను ఖండిస్తానన్నాడు.

8వ జ్ఞాన సదస్సు

డిశంబరు 29వ తేది నుండి జనవరి 2వ తేది పుష్యపౌర్ణమి వరకు శ్రీశుకబ్రహ్మాశ్రమంలో జరుగును. ఆచార్యులు పూజ్యశ్రీ ప్రణవానంద స్వాములవారు (లత్తవరం) **విషయం : ఛాందోగ్యోపనిషత్తు**

ఆతిథ్యంతో శివుని మెప్పించిన మార నాయనారు

– మధుర చంద్రశేఖరరావు

ద్రావిడ దేశంలో పాండ్య రాజులు పాలించిన ప్రాంతం విలక్షణమైనది. వైగై నదీ జలాలతో ఈ ప్రాంతం పునీతమై పాడి పంటలతో అలరారేది. పాండ్యుల రాజధాని మధురా నగరం దేశంలోనే పేరెన్నికగన్న పట్టణం. మీనాక్షీ సుందరేశ్వరులు కొలువై యున్న మధుర సుప్రసిద్ధ శైవ క్షేత్రంగా కూడా ఖ్యాతి గాంచింది. సముద్ర తీర పట్టణాలు ద్వీపాంతర వ్యాపారాలతో సిరి సంపదలతో తులతూగేవి. తీర ప్రాంతమైన రామనాథపురం పరిసరాలలో “ఇళైయాన్కుడి” అను సంపన్న గ్రామం ఉంది. ప్రజలంతా పరమ శివుని భక్తులు. ముఖ్యంగా చిదంబరంలోని నటరాజేశ్వరుని పట్ల కనకసభలో ఆద్యంతాలు లేని తాండవ నృత్యం చేసే పరమ శివుని పట్ల భక్తి ప్రపత్తులు కలవారు. ఆ గ్రామంలో మారర్ అను అత్యంత ధనికుడు నివసించేవాడు. ఈశ్వరానుగ్రహం వల్ల అతనికి కుబేరుని మించిన సంపత్తి ఉండేది. శివుడు ప్రసాదించిన సంపద శివ భక్తులకే అన్న సత్యాన్ని ఆచరణలో చూపేవాడు. శివ భక్తులను సాదరంగా ఆహ్వానించి వారికి అతిథి సత్కారాలు చేస్తూ ఎన్నో రకాలుగా సహాయం అందించేవాడు. అలా చేయటం తన విధిగా భావించేవాడు. పరమ శివుడు మారర్ కర్తవ్య నిష్ఠను పరీక్షించదలచాడు. ఫలితంగా మారర్ భాగ్యరాసులన్నీ క్రమంగా అదృశ్యమైనాయి. తన సమస్త సంపదలు తరిగిపోయినందుకు మారర్ ఏ మాత్రం చింతించలేదు. అందిన వరకు అప్పులు చేసి శివ భక్తులకు ఆతిథ్యం ఇచ్చేవాడు.

కాలం ఇలా జరుగుతుండగా, ఒక రోజు అర్ధరాత్రి వర్షం కురుస్తున్న సమయంలో శివుడే ఆకలిగొన్న శివ భక్తునిలా మారర్ ఇంటికొచ్చాడు. ఇంట్లో అడుగుపెట్టిన అతిథిని మర్యాదగా కూర్చుండబెట్టి వర్షంలో తడిసినందున తుడిచే ఏర్పాటు చేస్తాడు. తన భార్యతో మన ఇంట్లో తినడానికి ఏమీ లేకున్నా, అతిథి సత్కారంలో లోపం రాకూడదని చెప్పాడు. ఇంత రాత్రివేళ ఇరుగు పొరుగు వారిని అడగాలన్నా ఇబ్బంది కనుక ఆలోచించి ఒక ఉపాయం చెప్పింది. వారి పొలంలో నేడు వడ్ల విత్తనాలు చల్లారనీ, వర్షానికి అవి నీటిలో తేలుతుంటాయి. కనుక భర్తను అవి తెమ్మని చెప్పగా ఆనందించిన మారర్ వర్షం కురుస్తున్నా, చీకటిలో కష్టపడి పొలానికి వెళ్ళి తేలుతున్న వడ్ల గింజలను ఒక బుట్టలో నింపి ఇంటికెళ్ళాడు. భర్త రాక కోసం ఇంటి బయటే వేచియున్న భార్యకు వడ్ల బుట్ట అందించాడు. పొయ్యి రాజేసేటందుకు వంట చెరకు లేదని భార్య చెప్పగానే ఇంటి కప్పులోని ఒక వెదురు బొంగును కోసి ఆ సమస్యను పరిష్కరించాడు మారర్. ఇంటి ఇల్లాలు కష్టపడి అన్నం వండుతుంది. కాని కూరలకై వెతుకులాట ప్రారంభమై చివరకు పెరటిలో సగం పెరిగిన ఆకు కూర మొక్కలను తెంపి ఇల్లాలికివ్వగా ఆమె తగిన వంటకాలు తయారు చేసింది. మారర్ శివ భక్తుని వద్దకేగి జరిగిన ఆలస్యానికి క్షమించమని, భోజనానికి రమ్మని ప్రార్థిస్తాడు. ఆ పరమశివుని పరీక్షలో నెగ్గిన మారర్ దంపతులకు నంది వాహనుడై సతీ సమేతంగా శివుడు దర్శనమిచ్చి మారర్ తన కర్తవ్య నిర్వహణలో చూపిన భక్తి తత్పరతను ప్రశంసిస్తూ వారిని కైలాసంలో ఉంటూ తన్ను సేవించమని వరం ప్రసాదిస్తాడు. మార నాయనారు విధినిర్వహణను జనులు వేనోళ్ళ కొనియాడారు.

హృదయంలో అవిద్య రాజ్యమేలుతున్నంతవరకు మనోబుద్ధులు ఎన్నటికీ పరిశుద్ధం కావు. మనస్సు, బుద్ధి భిన్నాలంటారు.కానీ అవి పరిశుద్ధమైనపుడు ఏకమై చైతన్యంలో లయిస్తాయి. – శ్రీరామకృష్ణ పరమహంస

పరమహంస సదుపదేశములు

– శ్రీ రామకృష్ణ పరమహంస

1. ఈ శరీరమందు 'అహం' అనునది ఏదియో చింతనజేయుము. విచారణ చేయుచు రాగా అహం పదార్థమనునది ఏదియు వుండదు. నీరుల్లి యొక్క పొరలను తొలగించుచు రాగా ఏమియు మిగులదు. జీవునియందు 'అహం' నశించిపోగా భగవంతుడు ఒక్కడే శేషించును.

2. పరమాత్మను దర్శించగోరిన ముముక్షువు నిత్యానిత్య వస్తు వివేకము కలిగి భగవన్నామమును శ్రద్ధతో స్మరించుచుండవలెను.

3. స్వేచ్ఛగ విహరించు ఏనుగు పంటలను, చెట్ల యొక్క కొమ్మలను నాశము చేయును. కాని అంకుశమును కలిగియున్న మావటీవాడు దానిని తన అదుపులో వుంచుకొనును. అటులనే అజ్ఞానులందు మనస్సు అనేక ప్రాపంచిక విషయములందు తిరుగాడుచు జీవునకు అశాంతిని కలిగించును.
కాని వివేకమను అంకుశమును సంపాదించినచో మనస్సు తన చంచల స్వభావమును వీడి శాంతముగ స్థితి నొందియుండును.

4. ఏకాంత ప్రదేశమందు కూర్చుండి భగవన్నామమును స్మరించు చుండినచో – శబ్దమునకు చెట్టుపైగల పక్షులన్నియు ఎగిరిపోవునట్లు – అతని మనస్సునందుగల దుస్సంస్కారములు క్షీణించిపోయి పరమశాంతి లభించును.

5. మలినముగ వున్న అద్దమందు వస్తువుయొక్క ప్రతిబింబము చక్కగ గోచరింపదు. నిర్మలమైన అద్దమందే ప్రతిబింబము స్పష్టముగా అగుపడును. అదేరీతిగ మలిన మనస్సునందు, అజ్ఞాన మనస్సునందు దైవానుభూతి కలుగదు. నిర్మల మనస్సునందే భగవదనుభూతి సంభవించును.
కనుక ముముక్షువు ఇంద్రియనిగ్రహము, వైరాగ్యము, సత్సాంగత్యము, ధ్యానాదుల ద్వారా మనస్సును నిర్మలముగా ఒనర్చుకొని ఆత్మ సాక్షాత్కారమును బడసి పరమానందమును అనుభవించవలెను.

వార్తలు

(01). శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో 4-11-2017వ తేది కార్తీక పౌర్ణమి నాడు ఉదయం 10॥నుండి 12.30 గం॥ల వరకు గురుపాదుకాపూజ, ధన్వంతరి హోమం జరిగినది. ధన్వంతరి హోమంలో అనేక ఔషధమూలికలతో హవనం చేయబడింది. అట్లే మధ్యాహ్నం 1 గం॥నుండి వనబోజనం జరిగింది. జ్ఞాన సదస్సుకు వచ్చిన, కృష్ణాజిల్లా, గోదావరి జిల్లా, అనంతపురం జిల్లా, కర్నాటక పావగడ నుండి వచ్చిన భక్తులు, స్థానికులు, ఆశ్రమవాసులు 400 వందల మంది ధన్వంతరి హోమంలో, పాదుకాపూజలో పాల్గొని తరువాత వనభోజనంలో పాల్గొని భోజనాలు చేశారు. ధన్వంతరిహోమం తిరుత్తణి వాసి శ్రీయోగానందస్వామి గారి ఆధ్వర్యంలో జరిగినది.

(02). 5-11-2017వ తేది కృత్తిక సందర్భంగా ఆశ్రమంలో ప్రదోషకాలంలో శ్రీసుబ్రహ్మణ్యస్వామి వారికి షోడశోపచారపూజ జరిగి ప్రసాదవినియోగం జరిగినది.

(03). 12-11-2017, 13-11-2017వతేదీలలో గుంటూరు సమీపం నంబూరు శ్రీకాళీవనాశ్రమంలో జరిగిన ఆశ్రమస్థాపకులు పూజ్యశ్రీ బాబుగారి ఆరాధనలో శ్రీవిద్యాస్వరూపానందగిరిస్వాములవారు పాల్గొనినారు.

(04). 20-11-2017,21-11-2017,,22-11-2017 తేదీలలో అనంతపురం జిల్లా, గుంతకల్లు సమీపం గూళ్లపాలెం గురుదేవ ఆశ్రమంలో జరిగిన దేవతా ప్రతిష్ఠా కార్యక్రమంలో శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు పాల్గొనినారు.

(05). 23-11-2017వ తేది చైతన్య ట్రస్టు నడుపు యోగభారతి ప్రకృతి చికిత్సాలయం శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో ప్రారంభింపబడినది.

(06). 29-11-2017వ తేది బుధవారం శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో గీతాజయన్తి జరుపబడినది. ఈ సందర్భంగా గీతామాతకు షోడశోపచార పూజ జరిగినది. గీత 18 అధ్యాయాలు అఖండ పారాయణ జరిగినది. అట్లే తిరుపతి శ్రీమలయాళ సద్గురు సేవా సమాజంలో 3 రోజులు గీతాజయన్తి మఱియు సమాజ వార్షికోత్సవమున్ను జరిగినది.

(07). ఆశ్రమ కంతి ఆసుపత్రిలో అక్టోబర్ నెలలో ఓ.పి.లో **611** మందికి కంటి పరీక్షలు, చికిత్సలు చేయబడినవి. **54 గురుకి**కంటి పొరలు తీసి కళ్లలో లెన్సు అమర్చబడినవి. **3 గ్గురికి** యాగ్ లేజర్ చికిత్సలు చేయబడినవి.